క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్–11 కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ ప్రకటించారు. బౌద్ధనగర్ ఫీడర్ పరిధిలో ఉస్మానియా యూనివర్సిటీ, సెయింట్ ఆల్బెన్ స్కూల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

తొట్టెల ఊరేగింపు



తొట్టెల ఊరేగింపులో వి.శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్: వీఎస్‌టీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని కట్టమైసమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి హాజరై తొట్టెల ఊరేగింపులో పాల్గొన్నారు. జైదేవ్, దేవేందర్, సతీష్, జహంగీర్, శంకర్, విక్కి, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్ నియామకంపై హర్షం



రాజేశ్వర్‌రావును సత్కరిస్తున్న క్రిస్టియన్ సంఘాల నేతలు

ముషీరాబాద్: తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావును నియమించడంపై పలు క్రిస్టియన్ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. తెలంగాణ ఫాస్టర్స్ అసోసియేషన్స్ ప్రెసిడెంట్ లెమ్యూల్, కార్యదర్శి మధు విన్‌సెంట్, డానియల్, రావులపాటి మోజెస్‌లతో పాటు పలువురు శుక్రవారం రాజేశ్వర్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు.

సీపీకి శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ నేత వెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: పదోన్నతి పొందిన నగర సీపీ సీవీ ఆనంద్‌కు బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జి బి.వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. డీజీపీగా పదోన్నతి పొంది ప్రజలకు మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. బీజేపీ నాయకులు ఆనంద్‌గౌడ్ ఉన్నారు.

ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి

అంబర్‌పేట: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని బాగ్‌అంబర్‌పేట్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి కోరారు. శుక్రవారం డివిజన్‌లోని రామకృష్ణనగర్‌లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఓటరు జాబితాలో పేరు నమోదుతో పాటు ఇంటి చిరునామా, ఇతర మార్పులను సవరించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. స్థానిక బీజేపీ నాయకులు, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త తొలగింపులో నిర్లక్ష్యం వద్దు

కాచిగూడ: వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ మారుతిదివాకర్‌ను పిలిపించి హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 16లో పేరుకుపోయిన చెత్తను, సరిగ్గా తొలగించని ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ హిమాయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు నయీమ్ తదితరులున్నారు.

14 నుంచి ఉచిత యోగా శిక్షణ..

కాచిగూడ: జీవీఆర్ కరాటే అకాడమీలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఈనెల 14 నుంచి 18 వరకు యోగాలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రముఖ యోగా థెరపిస్ట్ రేవతి ఆధ్వర్యంలో కాచిగూడలోని అకాడమీలో యోగా శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. వివరాలకు సెల్: 8978114086.

తెరుచుకున్న సీపీఎల్ రోడ్డు

అంబర్‌పేట: మూసివేసిన రహదారిని ఎట్టకేలకు పోలీసు విభాగం తెరిచింది. ప్రజలు, నేతల విజ్ఞప్తి, ఒత్తిడి మేరకు శుక్రవారం ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్ సీపీఎల్ ప్రభుత్వ పాఠశాలల ఎదురుగా ఉన్న రహదారిని తెరిపించారు. దీంతో సామాన్యులకు ఉపశమనం లభించినట్లైంది.

రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులు

- నర్సింహబస్తీలో రూ.73 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన
- పథకాలపై దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే సూచన



కార్పొరేటర్ అమృతతో కలిసి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

నల్లకుంట: రూ. 2 కోట్లతో నల్లకుంట డివిజన్ నర్సింహబస్తీ సమగ్రాభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. నర్సింహబస్తీలో రూ. 73 లక్షలతో నూతనంగా చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు శుక్రవారం స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రైతుబంధు, దళితబంధు, గృహలక్ష్మి, బీసీ– మైనార్టీబంధు లాంటి పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. సీఎం ఆదేశాలు, మున్సిపల్ శాఖ మంత్రి సహకారంతో నియోజకవర్గంలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నర్సింహబస్తీ ప్రజల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే తన బడ్జెట్ నిధులతో బస్తీలో గ్రంథాలయాభివృద్ధి, నూతనంగా సివరేజ్, డ్రైనేజీ పైపులు వేయించానన్నారు. పనులు పూర్తి కావడంతో ప్రస్తుతం సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు.

అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు..

చిన్న ఖాళీ ఇంటి స్థలం ఉన్నవారు, రేకులతో ఇళ్లు ఉన్నవారు ఎవరైనా కొత్తగా పక్కా డాబా నిర్మించుకుంటామంటే అలాంటి వారికి గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. చిన్న ఇంటి స్థలంలో ఇళ్లు ఉండి, మొదటి అంతస్తు నిర్మించుకోవాలనుకునే వారికి కూడా ఈ పథకం ద్వారా డబ్బులు మంజూచేయిస్తానన్నారు. గృహలక్ష్మి కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దని బస్తీ ప్రజలకు ఎమ్మెల్యే సూచించారు.

- ఇంటి ఖాళీ స్థలం లేదా రేకుల ఇంటి ఫోటో, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఓటర్‌కార్డు జిరాక్స్‌లను జతజేసి ఈనెల 20లోగా అందజేయాలన్నారు.
- దరఖాస్తు చేసుకున్న వారిలో లాటరీ ద్వారా మూడు వేలమందిని ఎంపిక చేస్తారని చెప్పారు. లాటరీలో ఇళ్లు మంజూరైన వారికి రెండోసారి లాటరీ వేసి ఎవరికి ఏ అంతస్తులో ఇళ్లు కేటాయించాలనేది అధికారులు నిర్ణయిస్తారని వివరించారు.
- తాము కోరుకున్న అంతస్తులో ఇళ్లు ఇప్పిస్తామని దళారులు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్, నర్సింహబస్తీ అధ్యక్షుడు ఎం.భూపతినాథ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడిప్రసాద్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



రచ్చబండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు

నర్సింహబస్తీలో ఎమ్మెల్యే రచ్చబండ..

నర్సింహబస్తీలో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు కార్పొరేటర్ అమృత, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి నియోజక వర్గంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బస్తీలో రచ్చబండ కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం ఎమ్మెల్యే బస్తీ వాసుల విజ్ఞప్తులను ప్రశాంతంగా విని వాటిపై ఆరా తీశారు. ఓ వీధిలో పైపులైన్ వేయించి, సీసీ రోడ్డు వేయించాలని, కొన్ని చోట్ల సీసీ కెమెరాలు లేవని ప్రజల రక్షణార్థం వాటిని ఏర్పాటు చేయించాలన్నారు. బస్తీలోని యువతకు ఉపయోగపడేలా లైబ్రరీని మరింత అభివృద్ధి చేయించాలని బస్తీ ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. బస్తీవాసుల విజ్ఞప్తులకు స్పందించిన ఎమ్మెల్యే వారం, పది రోజుల్లోగా వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బస్తీలో ఆధునిక విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయిస్తానన్నారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రమణానాయుడు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

యువతలో నైపుణ్యం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌డీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని 'సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్' (ఎస్ఆర్‌డీ) డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. విద్య, వైద్యపరంగా మన రాష్ట్రంలో పూర్తిగా వెనుకబడి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. యాక్షన్ ఎయిడ్ ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంతర్జాతీయ యువత దినోత్సవాన్ని పురస్కరించుకొని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురికివాడల్లోని అమ్మాయిలు విద్యపరంగా వెనుకబడి ఉన్నారన్నారు. అమ్మాయిలను ప్రభుత్వ పాఠశాల, అబ్బాయిలను ప్రైవేటు పాఠశాలల్లో చదివించడంతోపాటు చిన్నచిన్న కారణాలతో అమ్మాయిలను చదువులను మాన్పించి వేస్తూ.. విద్యకు దూరం చేస్తున్నారన్నారు. మురికివాడ బస్తీల్లో యువత మాట్లాడుకునేందుకు అనువైన స్థలాలు కూడా లేవన్నారు. సామాజిక కార్యకర్త ఎం.ఆంజనేయులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు షాహీన్, అస్రీత, సుభాషిని, ఖరీం, సంజీవ్, మజహర్ హుస్సేన్ తదితరులున్నారు.

గ్రూప్‌-2 పరీక్షలు వాయిదా వేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆగస్టు 29,30 తేదీల్లో నిర్వహించే గ్రూప్‌–2 పరీక్షలు వాయిదా వేసి రెండు నెలల తర్వాత నిర్వహించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్‌లు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం జాబ్ కేలండర్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. ఇప్పటికే ప్రకటించిన గురుకుల బోర్డు పరీక్షలు ఈనెల 23 వరకు ఉండటంతో ప్రిపరేషన్‌కు సమయం లేక తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రూప్‌–2పరీక్షలు వాయిదా వేయాలని కోరారు.

కాచిగూడ: తెలంగాణలో గ్రూప్ –2 పరీక్ష వాయిదా వేయాలని నేషనల్ ఎకనామికల్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు తాడిశెట్టి పశుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన మొండి వైఖరిని విడనాడి నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా విధంగా చూడాలని ఆయన ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని గ్రూపు–2 పరీక్షలు వాయిదా వేయాలని లేకపోతే నిరుద్యోగులు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ వెంటనే జోక్యం చేసుకుని గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేస్తూ.. ప్రకటించాలని ఆయన కోరారు.

నియామకం

కాచిగూడ: మున్నూరుకాపు సంఘం గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలిగా బండారు లతా పటేల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్నూరు కాపు సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్.వి.మహేందర్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం సంఘం మహిళా ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధానకార్యదర్శిగా కమటం పద్మను ఎన్నుకున్నారు. త్వరలోనే పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు మహేందర్ ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య, పద్మపటేల్, కొత్తూరు స్వాతి, కల్యాణి, శ్రావణ్‌కుమార్, రాజేందర్, హరికృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.



లతాపటేల్‌ను అభినందిస్తున్న దృశ్యం


గద్దర్‌కు కొవ్వొత్తులతో నివాళి



నివాళులర్పిస్తున్న బీసీ జాగృతి అధ్యక్షుడు మురళీకృష్ణ తదితరులు

నల్లకుంట: తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో దివంగత ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతికి అశ్రు నివాళిగా నల్లకుంట సత్యానగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ. మురళీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంగౌడ్, ఉపాధ్యక్షుడు రమేష్, ఎంబీ.కిశోర్ కుమార్, సత్యానగర్ బస్తీ అధ్యక్షుడు రాంచందర్, రత్నానగర్ బస్తీ అధ్యక్షుడు ఈశ్వర్, జాగృతి ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ సూచించారు. శుక్రవారం కాచిగూడ డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. పలపు అభివృద్ధి పనులపై సూచనలు, సలహాలు చేశారు. డివిజన్‌లోని సునార్‌లేన్, మోతీమార్కెట్, ఇందిరానగర్, చెప్పల్‌బజార్, కాశీరామ్ జీరా, బసంత్‌కాలనీ, పర్వరీష్‌బాగ్, తదితర ప్రాంతాల్లో నూతనంగా మంజూరైన సీసీరోడ్డు పనులను ప్రారంభించాలని సూచించారు. జీహెచ్ఎంసీ ఏఈ విశ్వ, బీజేపీనేతలు బీమ్ రాజ్, ఎస్.రవియాదవ్, ఆర్.సంతోష్ ఉన్నారు.

ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్' ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా విలీనం– ఉత్పన్నమయ్యే సమస్యలు, పరిష్కారం అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా విలీనం చేయాలనే నిర్ణయం హర్షనీయమని తక్షణమే ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ కార్మికులు పొందుతున్న వేతనాలు, అలవెన్సులు, పని పరిస్థితులు, చట్టాల అమలు, సర్వీసు కండిషన్స్, ఉద్యోగ భద్రత వంటి విషయాల్లో అనేక మార్పులు చోటు చేసుకుంటాయని పేర్కొన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వీ.ఎస్.రావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాయకులు వీరాంజనేయులు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ లింగమూర్తి, నరేందర్‌రెడ్డి, గంగాధర్, సత్తిరెడ్డి, సుధాకర్ తదితరులున్నారు.

14న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా

ముషీరాబాద్: ముషీరాబాద్ క్రాస్‌రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐలో 14వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా నిర్వహించబడుతుందని ప్రిన్సిపాల్ ఎం.హనుమానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్, ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీలు అప్రెంటిస్‌ల ఎంపికకు కోపా, ఎలక్ట్రిషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఫిట్టర్, టర్నర్, మిషనిస్ట్, మెకానిక్ కార్ అండ్ ఏసీ, మెకానిక్ డీజిల్ వెల్డర్ పాసైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు.

కాశీపతికి ఘన నివాళి

ముషీరాబాద్: ప్రముఖ విప్లవ కవి, జర్నలిస్టు యాదాటి కాశీపతి 7వ వర్ధంతి విద్యానగర్‌లోని చంద్ర పుల్లారెడ్డి భవన్‌లో శుక్రవారం జరిగింది. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సరళ, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఏ.సాంబ, నాగరాజు, శ్యామ్, ధరణి, మల్లిక్, కొండల్, తిరుపతి తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ తదితర నాయకులు

'ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం'

ముషీరాబాద్: గత తొమ్మిదేళ్లుగా ప్రజలను గాలికి వదిలేసి ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ప్రకటించని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు సమీపిస్తున్నందున వివిధ పథకాలను ప్రవేశపెడుతున్నారని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ విమర్శించారు. శుక్రవారం విద్యానగర్‌లోని బీసీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. 'ఒక్క రూపాయి కూడా అందించకుండానే ఏదో జరిగిపోతుందనే భ్రమల్లో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించే కుట్ర చేస్తున్నారన్నారు'. మూడు రోజుల గడువుతో మూడు నెలలు కష్టపడినా.. రాని సర్టిఫికెట్ల నిబంధనలతో గృహలక్ష్మి పథకాన్ని ఎలా పెట్టారని ఆయన ప్రశ్నించారు. వైన్స్‌షాపుకు 15 రోజుల గడువు ఇచ్చి అవసరమైతే పొడిగింపు చేశారని సగటు ప్రజల పథకానికి ఆ సదుపాయం లేదని విమర్శించారు. పి.సుధాకర్‌ముదిరాజ్, రాజేందర్, జి.కృష్ణ, నర్సింహ్మగౌడ్, వెంకట్ తదితరులున్నారు.

మహిళను దూషించిన కేసులో 8 రోజుల జైలు



నిందితుడు షేక్ ఒమర్ బిన్ అబ్దుల్లా

కాచిగూడ: మహిళను దూషించిన కేసులో ఓ రౌడీ షీటర్‌కు 8 రోజులు జైలు శిక్ష పడిన ఘటన సెక్రటేరియట్ (లేక్) పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎంఎస్ మక్తాకు చెందిన ఓ మహిళతో రౌడీషీటర్ షేక్ ఓమర్ బిన్ అబ్దుల్లా బవాజిర్ గొడవకు దిగాడు. మహిళ ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా.. న్యాయమూర్తి 8 రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై ప్రదీప్ తెలిపారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: విద్యార్థి దశనుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. అశోక్‌నగర్‌లోని గీతాంజలి ఉన్నత పాఠశాలలో శనివారం 2023–2024 విద్యాసంవత్సరానికి విద్యార్థి నాయక బృందం ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. దేశ తొలి ప్రధాని ఇదే మాటను పదేపదే చెప్పేవారని వివరించారు. నాయకత్వ లక్షణాలు అలవర్చుకున్న విద్యార్థినీవిద్యార్థులు భవిష్యత్తులో పోటీ ప్రపంచంలో సమర్థవంతంగా రాణించగలుగుతారన్నారు. విద్యార్థులు చదువుతో అన్ని రంగాల్లో ఆసక్తి కనబరచాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శాంత విద్యార్థుల చేత ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం హరితహారం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, రాకేష్‌కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్, గుండు జగదీష్, రవిశంకర్, గుండు శ్రీనివాస్, పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జి రాజేష్ తదితరులున్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం



స్వామివారి కల్యాణోత్సవంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ జెమినీకాలనీలోని పోచమ్మ దేవాలయంలో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ పూజారి జి.సాయికృష్ణ ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కాండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి, బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు పూస రాజు, కోశాధికారి రమేష్, గంగపుత్ర సంఘం, విజయ యువజన సంఘం, కుమ్మరి సంఘం, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విలువల పరిరక్షణ బాధ్యత గురువులదే..!



మాట్లాడుతున్న రాధిక

కాచిగూడ: పతనమవుతున్న విలువలను పరిరక్షించి సమాజానికి దిశానిర్దేశం చేసే బాధ్యత గురువులపైనే ఉందని రామకృష్ణ మఠం ప్రతినిధి రాధిక అన్నారు. ఇంటర్నేషనల్ యూత్ డే సందర్భంగా శుక్రవారం బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలి శ్యామలదేవి డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మంచి ఉపాధ్యాయులుగా ఎదగాలని ఆశించే వారు విద్యార్థుల భవిష్యత్తుకోసం వారికి ఉత్తమ లక్ష్యాన్ని ఏర్పరచుకోనేలా తీర్చిదిద్దాలన్నారు. సమాజానికి మంచి ఉపాధ్యాయులు అవసరమని, విద్యార్థులు నైపుణ్యవంతులుగా ఎదగాలని సూచించారు. కరస్పాండెంట్ డాక్టర్ డి.వసుంధర, ప్రిన్సిపాల్ బి.లావణ్య, శిరీష తదతరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూంపై రాష్ట్ర ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలి



మాట్లాడుతున్న బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు.

కాచిగూడ: డబుల్ బెడ్రూం ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ కేటాయించాలని డిమాండ్ చేస్తూ.. బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 12 న శనివారం ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు తెలిపారు. శుక్రవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మహాధర్నాలో ప్రజలు, పార్టీనేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల విషయంలో తన వైఖరిని మార్చుకోవాలని గౌతమ్‌రావు సూచించారు. పార్టీ నేతలు గోలి మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్యామ్ రాజ్, కృష్ణాగౌడ్, వనంరమేష్, జ్యోతి, శ్రీధర్, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్‌యాదవ్, పద్మావెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి..



పొట్లకాయల వెంకటేశ్వర్లు

కాచిగూడ: అర్హులందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 12న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అఖిల భారత కొలి సమాజ్ నేత పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్ పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



సంయుక్త కిసాన్ మోర్చా సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంయుక్త కిసాన్‌మోర్చా(ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో కనీస మద్దతు ధరల చట్టం చేయాల్సిన అవసరం ఉందని, విద్యుత్ సవరణ బిల్లు–2020ని రద్దు చేయాలన్నారు. రైతుల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రత్యేకంగా రుణ విమోచన చట్టాన్ని తీసుకురావాలని రైతులకు అనుకూలంగా ఫసల్‌బీమా పథకాన్ని మార్చాలన్నారు. రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. జాతీయ నాయకులు వేములపల్లి వెంకటరామయ్య, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పద్మ, ప్రభాకర్, వెంకన్న, భిక్షపతి, వెంకటయ్య, కన్నెగంటి రవి, నాగిరెడ్డి, రామకృష్ణ, వెంకటయ్య, గాదగోని రవి తదితరులున్నారు.

నిరుపేదలకు ఎమ్మెల్యే అంతిమ సంస్కారాలు



డబ్బులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: చనిపోయిన నిరుపేదలకు అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు కాచిగూడ హర్రాస్‌పెంట హిందూ శ్మశానవాటికకు గత మూడేళ్లుగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తన ధాతృత్వాన్ని చాటుకుంటున్నారు. ప్రతినెల లక్ష రూపాయలకు తగ్గకుండా తన సొంత డబ్బును ఖర్చు చేస్తున్నారని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జూలై నెలలో మరణించిన 33 మంది పేదల మృతదేహాల దహన సంస్కారాలకు రూ. 1.44 లక్షలను హర్రాస్‌పెంట హిందూ శ్మశాన వాటిక మేనేజర్ కుమార్‌కు ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చనిపోయిన అంతిమ సంస్కారాలు నిర్వహించడం పుణ్యకార్యమన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (45) ఉందానగర్ – ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని మరో వ్యక్తి మృతి..

కాచిగూడ: రైలు ఢీకొని ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం... గుర్తు తెలియని వ్యక్తి (55) ఉందానగర్ – తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసును రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.